


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 30.05.2026 | సంపుటి: 3 | సంచిక: 118 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 30.05.2026 | VOLUME : 3 | ISSUE : 118 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## తెలంగాణకు కేంద్రం నిరంతర సహకారం



- కాజీపేటలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీలకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :**

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి కి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోం దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. రాబోయే అయిదేళ్లలో 200 ఇంట ర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. వీటిని

మిగతా 2వ పేజీలో..

### ఎమ్మెల్యేలు జమీందార్లలా మారొద్దు
## పార్టీ కోసం పనిచేయాల్సిందే

- సోషల్ మీడియా ప్రచారంపై ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్
- పార్టీ కోసం పనిచేయడంలో ఎవరికీ మినహాయింపు లేదన్న రేవంత్
- ప్రతి 10 రోజులకు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని మంత్రులకు ఆదేశం
- వలస ఓటర్ల ఓట్లు డిలీట్ కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచన



3

### ఉద్యోగుల బకాయిల చెల్లింపులో
## రేవంత్ సర్కార్ స్పీడ్

తొలి విడతగా రూ.2,000 కోట్లు విడుదల

రిటైర్డ్ ఉద్యోగుల GPF బకాయిలకు పూర్తి క్లియరెన్స్

కమ్యూటేషన్ బకాయిల చెల్లింపులు పూర్తి

100 రోజుల్లో రూ.6,000 కోట్ల చెల్లింపుపై ప్రభుత్వం ఫోకస్



2

### ఆర్టీసీ విలీనంపై
## మళ్లీ వేడెక్కిన వివాదం




జూన్ 2లోపు నిర్ణయం తీసుకోవాలని జేఏసీ డిమాండ్

31న డిపోల ఎదుట ఎర్ర బ్యాడ్జీలతో నిరసనలు

విలీన ప్రకటన లేకపోతే ఆమరణ దీక్ష హెచ్చరిక

గుర్తింపు ఎన్నికలపై జేఏసీ అభ్యంతరం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 2న ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రాతపూర్వ కంగా తెలిపినా ఇప్పటివరకు స్పష్టత

మిగతా 2వ పేజీలో..



## ఇందిరమ్మ ఇండ్లే రిఫరెండం



- సవాల్‌ను స్వీకరించే దమ్ముందా కేటీఆర్?
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గురించి మాట్లాడే దమ్ము లేక హైదరాబాద్ ఇండ్ల మీద పడ్డావ్ అని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా 2వ పేజీలో..



## మేధో తెలంగాణ కోసం కృషి

- ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో యువతకు ప్రోత్సాహం
- పోటీ పరీక్షల్లో సమకాలీన వార్తా విశ్లేషణల కోసం 'వార్షిక' విడుదల
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే యువత ఆశలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..

## పట్టణ పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు సౌకర్య వంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లోని పేదవాడికి తన

మిగతా 2వ పేజీలో..





## రూ.25 లక్షల సుపారీ..

- హిట్ అండ్ రన్‌గా న్యాయవాది హత్య స్కెచ్.!
- మొయినుద్దీన్ హత్య కేసులో కీలక మలుపు
- రాజకీయ నేత, కుమారుడితో పాటు ఆరుగురు అరెస్ట్

3

## ఒక కార్డు.. ఎన్నో సేవలు

ప్రభుత్వ సేవల్లో పారదర్శకతకే యూనిఫైడ్ కార్డు

సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడం, పారదర్శకతను పెంపొందిం చడం, డిజిటల్ సేవలను ఒకే వేదికపై అందించడమే యూనిఫైడ్ స్మార్ట్ కార్డు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..




2

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లో అందుబాటులోకి




## మహిళల చేతుల్లోనే పరిశ్రమల జెండా ఎగరాలి

- మంత్రి సీతక్క
- మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభం

2

# ఇందిరమ్మ ఇండ్లే రిఫరెండం


మొదటిపేజీ తరువాయి

కేటీఆర్‌పై రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విరుచుకుపడ్డారు. అదే హైదరాబాద్‌లో ఇండ్ల అంశంపై సవాల్ చేస్తే ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం లేక పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నావన్నారు. చేతల ప్రభుత్వం కాబట్టే, చిత్తశుద్ధి, సత్తా ఉన్నాయి కాబట్టే తొలి రెండున్నరేళ్లలోనే గ్రామాల్లో 4.5 లక్షల ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించామని తెలిపారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించబోతున్నామని, హైదరాబాద్ పరిధిలో తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని వివరించారు. అవినీతి కేసుల నుండి తప్పించుకోవడానికి దిల్లీలో బీజేపీ నేతల ముందు మోకరిల్లింది మీరు.. ఈ విషయాన్ని స్వయంగా ప్రధాని మోదీ, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, మీ సోదరి కవిత సైతం ప్రస్తావించారని ఎద్దేవా చేశారు. కేసుల మాఫీ కోసం కాషాయ నేతల కాళ్లు పట్టుకున్న మీకు పౌరుషం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దళిత ముఖ్యమంత్రి నుండి డబుల్ బెడ్ రూం ఇండ్ల వరకు.. అన్నీ మాటలు తప్ప చేతలు ఎక్కడైనా ఉన్నాయా డ్రామారావు అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాల గురించి కేటీఆర్ మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు. ధరణి దందాలు, బినామీల బాగోతాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలు.. 2014కు ముందు మీ ఆర్థిక పరిస్థితి ఏమిటటో.. పదేండ్లు అధికారంలో ఉండి విచ్చలవిడిగా ఎలా దోచుకున్నారో ప్రజలందరికీ తెలుసునని మంత్రి పొంగులేటి అన్నారు. గ్రామాల్లో మీరు పదేండ్లలో కట్టిన ఇండ్ల కంటే రెండున్నరేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రెట్లు నిర్మించిందన్నారు. హైదరాబాద్‌లో ఇండ్ల నిర్మాణంపై మరోసారి సవాల్ విసురుతున్నా.. బీఆరఎస్ ప్రభుత్వం పదేండ్లలో కట్టిన ఇండ్ల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇండ్లు నిర్మిస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తా.. కాంగ్రెస్ ఎక్కువ ఇండ్లు నిర్మిస్తే పోటీకి మీరు దూరంగా ఉంటారా.. అని కేటీఆర్‌నుద్దేశించి మంత్రి పొంగులేటి నిలదీశారు.

# ఒక కార్డు.. ఎన్నో సేవలు

మొదటిపేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. పౌరులకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే కార్డుతో అందుబాటులోకి తీసుకురావాలని, వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న స్మార్ట్ కార్డు విధానాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో రామకృష్ణారావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే కార్డుఅన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది అనే విధానంతో యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డును రూపకల్పనకు కార్యాచరణను రూపొందించాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. రేషన్, పెన్షన్, మహాలక్ష్మి, తదితర అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆ కార్డుకు అనుసంధానించి ప్రజలకు అందించే సేవలను సులభతరం చేయాలని, అలాగే ప్రజల డేటా భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. దీనిపై తగు ప్రణాళికను రాబోయే పది రోజుల్లోగా సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పెన్షన్ డేటా, ఆరోగ్య ప్రొఫైల్ వంటి సమాచారం కూడా ఈ కార్డుకు అనుసంధానం చేసే అవకాశాలను కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానీయా, శైలజా రామయ్యర్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తు, సిజిజి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రవిగుప్తా, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, రఘునందన్ రావు, సమాచార, పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ జి.ముకుందరెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శి (ఐటీఈ అండ్ సీ) అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టణ పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

మొదటిపేజీ తరువాయి

జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవలి కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి అధికారులతో శుక్రవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇళ్లు కట్టడం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులనుబట్టి అవసరమైతే పది అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి వాటి పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తోపాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం డిజైన్లను ఖరారు చేసి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తమ ప్రభుత్వం తీసుకొస్తోందని మంత్రి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణకు కేంద్రం నిరంతర సహకారం

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా సుమారు 300 కిలోవి□టర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఇవి సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని, ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కిషన్ రెడ్డి తెలిపారు.

# మహిళల చేతుల్లోనే పరిశ్రమల జెండా ఎగరాలి

- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభం
- 'మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్' నినాదం ప్రపంచవ్యాప్తం కావాలి
- మహిళలను ఉద్యోగార్థులుగా కాదు.. ఉద్యోగాల కల్పకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి సీతక్క



హైదరాబాద్, మే 29:

మహిళల చేతుల్లో కేవలం బ్యాంకు పాస్‌బుక్కులు మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు కూడా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభ, ఆలోచనలు, వ్యాపార కలలను సాకారం చేసే దిశగా ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సాంకేతిక, వ్యాపార సహాయాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ మహిళల భవిష్యత్తును మార్చే ఆర్థిక ఉద్యమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ద్వారా 67 లక్షల మంది మహిళలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని, ఇప్పటికే 6.43 లక్షల మంది మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి వ్యాపారాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక ఎస్‌హెచ్‌జీ యాప్‌ను కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. దేశంలోని ప్రముఖ ఆవిష్కరణ వేదిక టిహబ్, బిట్స్ పిలానీ భాగస్వామ్యంతో రెండు ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒక్కో కేంద్రానికి రూ.10.70 కోట్ల చొప్పున మొత్తం రూ.21.40 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ, బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ సపోర్ట్, ఆర్థిక మార్గదర్శకత్వం, బిజినెస్ మెంటరింగ్ వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. తొలి దశలో 300 మంది మహిళా పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. "ఉద్యోగాల కోసం వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మహిళలు ఎదగాలి. మహిళలు జాబ్ సీకర్స్గా కాకుండా జాబ్ క్రియేటర్స్గా మారాలి" అని మంత్రి స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజ్ రుణాలు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాలు 100 శాతం రుణాల చెల్లింపుతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో అవకాశాలు కల్పించడమే ఇంక్యుబేటర్ల ప్రధాన లక్ష్యమని సీతక్క చెప్పారు. మధిరలో మహిళల కోసం ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్లాంట్లు నెలకు రూ.5 లక్షల వరకు ఆదాయం తెస్తున్నాయని, మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు నెలకు రూ.4 లక్షల వరకు లాభాలు ఆర్జిస్తున్నాయని వివరించారు. మేడారం సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా 554 మంది మహిళలకు రూ.6 కోట్ల ఆర్థిక సహాయం అందించగా, కేవలం 15 రోజుల్లోనే రూ.9.5 కోట్ల వ్యాపారం నిర్వహించారని తెలిపారు. ఫుడ్ ట్రక్కులు, ఫిష్ మొబైల్ ట్రక్కులు వంటి వినూత్న వ్యాపార నమూనాలను మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. స్థానిక మార్కెట్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని మహిళలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. చేర్యాల మహిళలు తయారు చేసిన చింతపండు ఉత్పత్తులు నెదర్లాండ్స్కు ఎగుమతి కావడం తెలంగాణ మహిళల సృజనాత్మకతకు నిదర్శనమన్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్" అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా మార్మోగాలని ఆకాంక్షించారు. మహిళలకు అవకాశాలు కల్పించడమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకునే ధైర్యాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ఒక మహిళా వ్యాపారవేత్త ఎదగాలని, ఒక మహిళ విజయం మరో మహిళకు స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య

# సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

హైదరాబాద్, మే 29 :

రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ రైతులు ఆర్గానిక్ సాగుకు ముందుకు రావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఆర్గానిక్ మేళాను ఆయన సందర్శించి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్ల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని, వాటిని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల నేల సారం దెబ్బతింటోందంటూ అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ హాస్పిటల్స్ వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతోపాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 29:

తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మాసాబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని, జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 15న నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా( పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

# మేధో తెలంగాణ కోసం కృషి

మొదటిపేజీ తరువాయి

కృషి చేస్తున్నదని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ పోటీ పరీక్షలలో యువత విజయం సాధించేందుకు కావలసిన మెళకువలను, శిక్షణను ఉచితంగా అందిస్తూ మేధో తెలంగాణ సాధన దిశగా పయనిస్తోందని, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలను యువతకు అందుబాటులోకి తీసుకొస్తున్నదని చెప్పారు. పోటీ పరీక్షలలో కరెంట్ అఫైర్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉందని, 20 నుంచి 25 శాతం ప్రశ్నలు సమకాలీన వార్తలు విశేషాల మీద ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులందరూ కరెంట్ అఫైర్స్‌పై సాధికారత సాధించేందుకు 'వార్షిక 2025' పేరుతో 2025లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలు, విశేషాలు, వ్యక్తులు, సంఘటనలకు సంబంధించిన సమాహారంగా పుస్తకాన్ని రూపొందించామని చెప్పారు. ఈ పుస్తకంలో రాబోయే ఎండోమెంట్స్ డిపార్టుమెంట్ ఉద్యోగాలకు సంబంధించిన భారతీయ వైదిక హైందవ విజ్ఞానం పేరుతో ప్రత్యేక సమాచారాన్ని కూడా అందించామని, కరెంట్ అఫైర్స్ మాత్రమే కాక ప్రతి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థికి కావలసిన సాధారణ పరిజ్ఞానాన్ని, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, భూగోళ శాస్త్రం, భారత దేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, ఉద్యమం వంటి విశేషాలను ఎన్నిటినో ఈ పుస్తకం అందిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పుస్తకాన్ని బీసీ స్టడీ సర్కిల్ ప్రచురించడం సంతోషదాయకమని, దీనికి సంపాదకత్వం వహించి ఈ పుస్తకాన్ని ప్రచురించిన డైరెక్టర్ మామిడి హరికృష్ణను అభినందిస్తున్నానని అన్నారు. ఉన్నత విద్యావంతులైన యువత ప్రజలకు సేవ చేయడానికి ఉన్న ఒక చక్కని మార్గం ప్రభుత్వోద్యోగం అని, సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, పోలీస్, రైల్వే, ఉపాధ్యాయులు వంటి ఉద్యోగాల ఎంపికకు సంబంధించిన పోటీ పరీక్షల కోచింగ్ కోసం ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తూ అభ్యర్థులకు శిక్షణను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 బీసి స్టడీ సర్కిల్స్ ద్వారా అందిస్తోందనీ, ఈ శిక్షణను సక్రమంగా ఉపయోగించుకుని యువత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమంటే అది ఆ విజేతకు మాత్రమే కాక, వారి కుటుంబానికి, పుట్టిన ఊరుకి, జిల్లాకు, రాష్ట్రానికి కూడా గర్వ కారణమనీ, అలాగే ప్రభుత్వ ఉద్యోగం చేయడమంటే జాతి నిర్మాణంలో భాగస్వాములు కావడమే అని ఆయన చెప్పారు. అఖిల భారత ఉద్యోగాలను అత్యధిక సంఖ్యలో తెలంగాణ యువత సాధించాలని ప్రభుత్వం భావిస్తోందనీ, దానికోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో రాజీవ్ అభయ హస్తం పేరిట ప్రతి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ తెలంగాణ యువత కలల్ని సాకారం చేసే ప్రయత్నం చేస్తున్నదని మంత్రి పొన్నం గుర్తు చేశారు.

# ఆర్టీసీ విలీనంపై మళ్లీ వేడెక్కిన వివాదం

మొదటిపేజీ తరువాయి

ఇవ్వలేదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఆరోపించారు.
ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని ఇటీవల కలిసి విలీన అంశంపై చర్చించినట్లు తెలిపారు. విలీనం చేస్తామని ఆయన చెప్పారని, అయితే ప్రభుత్వ వైఖరిపై ఇంకా స్పష్టత లేకపోవడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ముందు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపడతామని వెల్లడించారు.
ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వం విలీనం సాధ్యం కాదని చెప్పిందన్నారు. సమ్మె తర్వాత ప్రభుత్వం స్పందించిందని, ఇప్పుడు గుర్తింపు ఎన్నికల అంశాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా సమస్యను మళ్లీ మొదటికి తీసుకెళ్తున్నారని విమర్శించారు.
తమకు ఎన్నికలు, సంఘాల గుర్తింపు కంటే ఉద్యోగుల విలీనమే ముఖ్యమని స్పష్టం చేశారు. జూన్ 2న ప్రభుత్వం విలీన ప్రకటన చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని హెచ్చరించారు.



# ఉద్యోగుల బకాయిల చెల్లింపులో రేవంత్ సర్కార్ స్పీడ్

హైదరాబాద్, మే 29:

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపులో భాగంగా తొలి విడతగా రూ.2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాల నాయకులకు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నిధుల విడుదల ఉత్తర్వులు జారీ చేశారు. విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (GPF) బకాయిలను పూర్తిగా క్లియర్ చేశారు. అలాగే మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిల చెల్లింపులను కూడా పూర్తి చేశారు. 100 రోజుల్లో మొత్తం రూ.6,000 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. మిగిలిన రూ.4,000 కోట్ల చెల్లింపుల కోసం కూడా వేగంగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న చొరవపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సివిల్స్ అభ్యర్థులకు ఉచిత ఓరియంటేషన్ ప్రోగ్రాం

**హైదరాబాద్, మే 29 :**

తన స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా సుపరిపాలన, ప్రజా సేవల మెరుగుదల లక్ష్యంగా సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల కోసం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఒక వారపు ఉచిత ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని సివిల్ సర్వీసెస్, గ్రూప్1 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. జూన్ 2వ తేదీ నుండి ఈ ఓరియంటేషన్ ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ మూడు గంటలపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిపుణులు, సీనియర్ అధికారులు మార్గదర్శకత్వం చేస్తారు. కార్యక్రమంలో ప్రధానంగా పరీక్షా వ్యూహాలు, ప్రణాళిక, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, నైతిక విలువలు నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం చేస్తారు. అయితే బోర్డింగ్, లాడ్జింగ్ సదుపాయాలు కల్పించరు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సీవీ/బయోడేటాను ctsmcrhrdit24@gmail.com కు పంపి నమోదు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో ప్రజా సేవా స్ఫూర్తిని పెంపొందించి, రాష్ట్రం, దేశానికి సమర్థులు, నిబద్ధత కలిగిన ప్రజా సేవకులను తయారు చేయాలనే సంస్థ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది.

## ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

- **బీజేపీ చీఫ్ రామచందర్‌రావు**



**సూర్యాపేట, మే 29 :**

దేశమే ప్రథమం (నేషన్ ఫస్ట్) అనే సిద్ధాంతంతో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సూర్యాపేట లో శుక్రవారం జరిగిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నక్సలైట్లు, జిహాదీల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల బలిదానాల వల్లే నేడు దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలు కొలువుదీరాయని చెప్పారు. తెలంగాణలో కూడా ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగిందని గుర్తు చేశారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణ అంతటా బీజేపీ జెండా ఎగురుతుందంటూ కార్యకర్తలు అంకితభావంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని రామచందర్ రావు దిశానిర్దేశం చేశారు. గత 12 ఏళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సుమారు రూ.13 లక్షల కోట్లను కేటాయించిందన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ములుగు సమ్మక్కసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, బీబీనగర్ ఎయిమ్స్, జాతీయ రహదారుల విస్తరణ, హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్, మెట్రో విస్తరణ, ఎంఎంటీఎస్ సేవలు అన్నీ మోదీ చొరవ వల్లే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. కాగా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. గత బీఆర్ఎస్ పాలనలో అన్యాయం జరగగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయన్నారు. ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లా□లోని మంత్రులు రైతులకు ఏమీ చేయలేకపోతున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక, లారీలు, టార్పాలిన్లు అందుబాటులో లేక అన్నదాత పడుతున్న బాధ వర్ణనాతీతమని రామచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తేమ పేరుతో కోతలు విధిస్తూ మిల్లర్లతో కుమ్మక్కవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా యాత్రతోనే ప్రభుత్వం కదిలిందన్నారు. కేంద్రం అన్ని రకాలుగా నిధులను రీయింబర్స్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 5 నుంచి చేనేత, వస్త్రాల ఎగ్జిబిషన్

- **హైటెక్స్‌లో 'థ్రెడ్ పోచంపల్లి'**
- **యాదాద్రి-భువనగిరి జిల్లా పర్యాటకం కోసం..**

**హైదరాబాద్, మే 29 :**

యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన గొప్ప సాంస్కృతిక వస్త్రాలు(పోచంపల్లి) థ్రెడ్ పోచంపల్లి పేరుతో హైదరాబాద్ నగర నడిబొడ్డుకు రానున్నాయి. చైతన్యవంతమైన నగర వినియోగదారులకు, గ్రామీణ చేతివృత్తి కళాకారులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు మూడు రోజులపాటు ఒక అద్భుతమైన ప్రదర్శన నిర్వహించనున్నారు. వందకు పైగా ప్రత్యేకమైన స్టాల్స్‌తో ఈ కార్యక్రమం ఈ ప్రాంత నేత కార్మికులు, తయారీదారుల నుండి నేరుగా లభించే అసలైన చేనేత వస్త్రాలు, చీరలు, సమకాలీన దుస్తుల కోసం ఒక ఖచ్చితమైన మార్కెట్‌గా నిలుస్తుంది. కేవలం ఒక రిటైల్ ప్రదర్శనకు అతీతంగా ఈ కార్యక్రమం ఒక సజీవ సాంస్కృతిక పర్యావరణ వ్యవస్థగా పనిచేస్తుంది. సందర్శకులు నేత కార్మికుల నుండి నేరుగా సంప్రదాయ వస్త్రాలు, దుస్తులను కొనుగోలు చేయవచ్చు, సంప్రదాయ మగ్గాల ప్రత్యక్ష ప్రదర్శనలను చూడవచ్చు. క్లిష్టమైన టైఅండ్ డై, నేత ప్రక్రియను నేర్చుకోవచ్చు. యాదాద్రిభువనగిరి జిల్లా నివాసితులు రూపొందించిన స్థానిక వంటకాలను ఆస్వాదించవచ్చు. జూన్‌లో జరగబోవు ఈ ప్రదర్శనను కేవలం ఒక ప్రత్యేక పాప్‌అప్‌గా కాకుండా విస్తృత యాదాద్రిభువనగిరి జిల్లాకు సుస్థిర పర్యాటకం కోసం ఒక అధికారిక ప్రారంభ స్థానంగా రూపొందించారు. హైదరాబాద్ నుండి వచ్చే పర్యాటకులు, ఔత్సాహికులు, నగరం నుండి కేవలం రెండు గంటల దూరంలో ఉన్న పోచంపల్లికి తమ తదుపరి వారాంతపు రోడ్ ట్రిప్‌ను ప్లాన్ చేసుకునేందుకు వీలుగా కొత్త అనుభవ సర్క్యూట్‌లు అందించనున్నారు.

తేదీలు: జూన్ 57

వివరాలు: యాదాద్రిభువనగిరి జిల్లా చేనేత, వస్త్రాలు, హస్తకళలు, వంటకాల కోసం వందకు పైగా స్టాల్స్.

వేదిక: హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హైదరాబాద్.

## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్

**హైదరాబాద్, మే 29 :**

పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ మూడు రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత పోలీసులు అతడిని మల్కాజిగిరి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్ చాట్ లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్ ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.



# రూ.25 లక్షల సుపారీ..

- **హిట్ అండ్ రన్‌గా న్యాయవాది హత్య స్కెచ్.!**
- **మొయినుద్దీన్ హత్య కేసులో కీలక మలుపు**
- **రాజకీయ నేత, కుమారుడితో పాటు ఆరుగురు అరెస్ట్**
- **భూ వివాదాల నేపథ్యంలో రూ.25 లక్షల సుపారీ**
- **హిట్ అండ్ రన్‌గా చూపించి పక్కా ప్లాన్‌తో హత్య**

**హైసరాబాద్ మే,29:**

: హైదరాబాద్ నగరాన్ని తీవ్రంగా కుదిపేసిన ప్రముఖ న్యాయవాది అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ హత్య కేసులో పోలీసులు సంచలన విషయాలను బయటపెట్టారు. చాలా కాలంగా కొనసాగుతున్న వక్ఫ్ ఆస్తుల వివాదాలు, కోర్టు కేసులు , వ్యక్తిగత కక్షల వల్లే ఈ ఘోర హత్య జరిగినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా పక్కా ప్రణాళికతో, కాంట్రాక్ట్ కిల్లింగ్ (సుపారీ) రూపంలో ఈ హత్యాకాండను అమలు చేసినట్లు పోలీసులు అధికారికంగా వెల్లడించారు.

గత మే 23వ తేదీ ఉదయం సుమారు 5:45 గంటల సమయంలో, అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ తన రోజువారీ అలవాటు ప్రకారం స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు మాసాబ్‌ట్యాంక్‌లోని తన నివాసం నుంచి బయటకు వచ్చారు. ఆయన ఇంటి ముందు పార్క్ చేసిన తన వాహనం వైపు వెళ్తుండగా, ముందే అక్కడ పొంచి ఉన్న నెంబర్ ప్లేట్లు లేని ఒక ఆకుపచ్చ రంగు మహీంద్రా స్కార్పియో వాహనం వేగంగా వచ్చి ఆయనను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు మొయిజుద్దీన్ దాదాపు 10 మీటర్ల దూరం ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం మహావీర్ ఆసుపత్రికి, ఆపై అబిడ్స్‌లోని ఉదయ్ ఓమ్ని ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు విడిచారు. తొలుత నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుగా నమోదైన ఈ ఘటన, దర్యాప్తు తర్వాత హత్య కేసుగా రూపాంతరం చెందింది.

ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు లభించిన సీసీటీవీ (CCTV) ఫుటేజ్ అత్యంత కీలకంగా మారింది. నిందితుల స్కార్పియో వాహనం ముందుగానే బాధితుడి ఇంటి వద్ద వేచి ఉండి, ఆయన రాగానే టార్గెట్ చేసి ఢీకొట్టిన దృశ్యాలు అందులో స్పష్టంగా రికార్డయ్యాయి. ఘటన అనంతరం నిందితులు పంచవటి లాడ్జ్, సికింద్రాబాద్ , నారాయణగూడలోని మెహ్‌ఫిల్ హోటల్ పరిసరాల గుండా పారిపోయినట్లు సీసీటీవీ ఆధారాల ద్వారా పోలీసులు గుర్తించారు. నిందితులు ఈ హత్య కోసం 2026 జనవరి నెల నుంచే అడ్వకేట్ మొయిజుద్దీన్ ఇల్లు, ఆయన తిరిగే ప్రదేశాలపై నిరంతరం నిఘా ఉంచి, పక్కాగా రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది.

ప్రధాన నిందితుడు ముజాహిద్ ఆలమ్ ఖాన్ అలియాస్ బాబా కుటుంబానికి, అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్‌కు మధ్య మలక్‌పేట్, లక్డీకాపూల్ ప్రాంతాల్లోని వక్ఫ్ ఆస్తులకు సంబంధించి పలు సివిల్, క్రిమినల్ , వక్ఫ్ ట్రైబ్యునల్ కేసులు నడుస్తున్నాయి. ఈ కోర్టు కేసుల్లో మొయిజుద్దీన్ చురుకుగా వ్యవహరిస్తూ తమకు వరుస పరాజయాలు ఎదురయ్యేలా చేస్తుండటంతో ముజాహిద్ ఆలమ్ ఖాన్, అతని తండ్రి మహబూబ్ ఆలమ్ ఖాన్ కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా ఆయనను అంతమొందించాలని రూ.15 లక్షల భారీ మొత్తాన్ని సుపారీగా నిర్ణయించారు. ఇందులో భాగంగానే తమ సన్నిహితుల ద్వారా సుపారీ కిల్లర్ కిషన్‌ను, అతని ద్వారా వినయ్, స్టంట్ మాస్టర్ అభిజీత్, విక్రమ్ తదితరులను రంగంలోకి దింపారు. హత్యకు వాడిన స్కార్పియో కారు కొనుగోలు కోసం ముజాహిద్ ఆలమ్ ఖాన్ రూ.2 లక్షల అడ్వాన్స్ కూడా ఇచ్చినట్లు పోలీసులు కనుగొన్నారు.


సాంకేతిక ఆధారాలు, మొబైల్ లొకేషన్ల సాయంతో పోలీసులు మొదట ప్రధాన నిందితుడైన కిషన్ అలియాస్ పప్పును హర్యానాలోని పానిపట్‌లో మే 27న అరెస్టు చేశారు. అతడిని విచారించగా ఈ నెట్‌వర్క్ మొత్తం బయటపడింది. దాని ఆధారంగా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ప్రధాన కుట్రదారు ముజాహిద్ ఆలమ్ ఖాన్ (A1), అతని తండ్రి మహబూబ్ ఆలమ్ ఖాన్ (A2), కారు నడిపిన అభిజీత్ (A4), ప్లాన్ వేసిన దిఘన్ వినయ్ (A5)తో పాటు విక్రమ్ ఆదిత్య (A8), మనిదీప్ (A10)లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి హత్యకు వాడిన స్కార్పియో వాహనంతో పాటు రూ.10.10 లక్షల నగదు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ ఏసీపీ పి. ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో నాంపల్లి పోలీసులు ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

## లారీ ఢీకొని ముగ్గురు కర్ణాటక వాసుల మృతి

- **వనపర్తి జిల్లాలో ప్రమాదం**

**వనపర్తి, మే 29;**

జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన ఓ లారీ బీభత్సం సృష్టించడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మల్లపల్లి వద్ద చోటుచేసుకుంది. కొత్తకోట సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్నారు. ముమ్మల్లపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ లారీ, బొలేరోను బలంగా ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే చనిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, లారీ డ్రైవర్పై కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ హాస్పిటల్కి తరలించామని తెలిపారు.



## ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

**హైదరాబాద్,మే 29:**


రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పా టు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పా రని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడు తుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్పై కంట్రోల్ లేదని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా అని ప్రశ్నించారు. హైదరాబాద్లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏలేటి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హమాలీల ఖర్చు రైతులే చెల్లిస్తు న్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోమ్మని గత సీఎం కేసీఆర్ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గద్దెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడు కుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఇబ్బందులుండొద్దు

- **నిబంధనలకు విరుద్ధమైతే ముందే నోటీసులివ్వాలి**
- **సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్, మే 29:**

మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న ఇబ్బందులపై సచివాలయంలో శుక్రవారం మంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానికంగా తలెత్తుతున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' దేశంలో సామాజిక ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యాలతో సాగిందన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపనలో అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసుల నమోదు సరికాదని మంత్రి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల మనోభావాలను గౌరవించాలని సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు నెలకొంటే ప్రభుత్వ దృష్టికి తేవాలన్నారు. మహనీయుల ఆశయాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (వెల్ఫేర్) సబ్యసాచి ఘోష్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, హైదరాబాద్ డీసీపీ2 కాజల్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి, ఏసీఎల్‌బీ జి. జితేందర్ రెడ్డి, ఎస్సీడీడీ వీసీ అండ్ ఎండీ (ఎఫఏసీ) హనుమంత్ నాయక్, ఎస్సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రామారావు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సంతోష్, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఎల్‌బీనగర్ సీపీ శ్రీనివాస్ యాదవ్, సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఓఎస్డీ వై.జే.విజయ్ కుమార్ తదితరులతోపాటు ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాటి సుదర్శన్‌బాబు, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాం ప్రసాద్, కళానిధి మాస్టర్ జీ, నల్ల సూర్యప్రకాశ్, సొసైటీ ఫర్ సోషల్ జస్టిస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జీటీ శేఖర్, ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాను, జి.బి.శ్యామ్ రావు, డాక్టర్ అంబేద్కర్ అండ్ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ (ఆదర్శ్‌నగర్) తాలూకా అనిల్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కుర్మల్‌గూడ నాయకులు సంగం మహేష్, కుర్మ మహేందర్, రాపాక అశోక్ తదితర దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేలు జమీందార్లలా మారొద్దు

# పార్టీ కోసం పనిచేయాల్సిందే

**హైదరాబాద్, మే29:**

కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులు, మంత్రుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడే విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూనే, క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల ప్రవర్తనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంతా సోషల్ మీడియా వారియర్లుగా మారి, ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు 'జమీందార్లు'గా తయారయ్యారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సదరు ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో కేవలం తమ వ్యక్తిగత ప్రచారం తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను అస్సలు ప్రచారం చేయనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలని, సోషల్ మీడియాను ఎలా ఉపయోగించాలనే అంశంపై ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను, క్యాడర్‌ను ప్రజాప్రతినిధులు విస్మరించకూడదని సీఎం హెచ్చరించారు. "పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కచ్చితంగా పనిచేయాల్సిందే. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు... ఇలా ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. ఇందులో నాతో పాటు ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవు" అని రేవంత్ రెడ్డి కరాఖండిగా తేల్చి చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.ఇకపై ఇన్చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజును పూర్తిగా పార్టీ కార్యక్రమాల కోసమే కేటాయించాలని, నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం ఆదేశించారు. కేవలం మంత్రులకే కాకుండా తనకు కూడా ఈ రూల్ వర్తిస్తుందని చెబుతూ.. తాను కూడా ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని, నెలలో మూడు రోజులు కేవలం కార్యకర్తల కోసమే సమయం ఇస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో పాటు రాబోయే రోజుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన కాంగ్రెస్ అనుకూల ఓటర్ల ఓట్లు తొలగిపోకుండా (డిలీట్ కాకుండా) చాలా జాగ్రత్త పడాలని పార్టీ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

రాజముద్ర




# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్– బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 –52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

- యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం




**న్యూఢిల్లీ, మే 29:** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యావత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్–యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025–26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

## వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

## విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, మే 29:** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీ కరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్–ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీ కరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్‌ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్‌ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీ కరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్‌ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్‌ఈకి సహకరిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.







# లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

## వారు కూడా మనుషులే అని గుర్తించాలి : సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 29 :** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.



# 'మహా' విషాదం

## కల్తీ మద్యానికి 11 మంది బలి

## ఆస్పత్రుల్లో పలువురి పరిస్థితి విషమం

## కల్తీ మద్యం సరఫరాపై ఇద్దరి అరెస్ట్..

## కఠిన చర్యలకు సీఎం ఫడ్నవీస్ ఆదేశం

**పుణె, మే 29:** మహారాష్ట్రలో కల్తీ మద్యం మరోసారి ప్రాణాలు బలిగొంది. పుణె, పింప్రి–చింఛ్వాడ్ జంట నగరాల్లో కల్తీ మద్యం సేవించి ఇప్పటివరకు 11 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్న వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే తెలిపారు. వీరిద్దరూ కల్తీ మద్యం సరఫరాలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక దృష్టి సారించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం తాండూర్ నియోజకవర్గం యాలాల్ మండలం లక్ష్మీనారాయణ రైస్ మిల్లు, ఐ కే పి సెంటర్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, జనగణనకు సంబంధించి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో భాగంగా లక్ష్యంగాపెట్టుకున్న ధాన్యాన్ని అన్లోడింగ్ చేయాలని, లారీలు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. యాలాల్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను అధికారులతో కలిసి పరిశీలించారు. లారీలు ఎన్ని వస్తున్నాయని ఆరా తీశారు. లక్ష్మీనారాయణ పూర్ లో శ్రీ బాలాజీ రైస్ మిల్ ను సందర్శించారు. ధాన్యం కొనుగోలు స్టాక్ వివరాలను మిల్ యజమానితో వివరాలపై ఆరా తీశారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలుచేసి తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. యాలాల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియ నమోదును పరిశీలించారు. జనగణన నమోదులో ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులదృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మండలంలో నిర్మాణములో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నాబార్డ్ నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులు టాయిలెట్లు, అదనపు గదుల నిర్మాణా పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి రేణుకదేవి, తాండూర్ ఆర్డీవో అనిత, యాలాల తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీఓ శ్రీనిజ, డీ. టీ. కిరణ్ కుమార్, ఆర్ఐ. శివ చరణ్, ఎంపీఓ ఆనంద్ రావు, డీఎం సి ఎస్ మోహన్ కృష్ణ , డి ఎస్ ఓ సుదర్శన్, మండల విద్యాధికారి మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# నేలకొండపల్లి: టీబీ రహిత గ్రామం దిశగా వైద్య శిబిరం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** టి బి రహిత తెలంగాణకై కృషి" అనే నినాదంతో ప్రతి గ్రామపంచాయతీని క్షయ రహిత గ్రామపంచాయతీగా మార్చడమే లక్ష్యంగా నేలకొండపల్లిలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు.జిల్లా క్షయ నిర్వహణ అధికారి డాక్టర్ వరికుటి సుబ్బారావు ఆధ్వర్యంలో, గ్రామ సర్పంచ్ శీలం వెంకట లక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల వైద్యాధికారి డాక్టర్ రచ్చ శ్రావణ్ కుమార్ ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈరోజు నిర్వహించిన శిబిరంలో దాదాపు 70 మందికి పైగా గ్రామస్తులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. క్షయ నిర్ధారణలో భాగంగా ప్రతి ఒక్కరికీ పోర్టబుల్ ఎక్స్‌రే నిర్వహించడంతో పాటు కళ్లె పరీక్షలు కూడా నిర్వహించారు. ఇందులో క్షయ అనుమానిత కేసులు ఉంటే వారిని గుర్తించి, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఎంపీహెచ్ఈఓ చంద్రశేఖర రావు, సూపర్‌వైజర్ కె. విజయ కుమారి, ఎస్టీఎస్ దేవయ్య, ఎస్టీఎల్ఎస్ మహేష్, సిస్టర్స్ జ్యోతి, రాణి, నాగమణి ఆశా కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి టీబీ లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీకి పూర్తి ఉచిత వైద్యం అందుబాటులో ఉందని డాక్టర్ రచ్చ శ్రావణ్ కుమార్ ప్రజలకు సూచించారు..

# అన్నదాతలను హరిగోశపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**కామారెడ్డి రాజముండ్రి న్యూస్:** రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అన్నదాతలను అరిగోషపెట్టడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు మధ్య దళారీలకు తమ పంటను తక్కువ ధరకు అమ్ముకునే దుస్థితి ఏర్పడింది కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజివాడి భూంపల్లి సదాశివ నగర్ ధర్మారావుపేట గ్రామాల్లో వర్షాకాలం సమీపించడంతో ఇక చేసేదేం లేక దళారులను ఆశ్రయించి తీవ్ర నష్టానికి గురి అవుతున్నారు ఈ గ్రామాల్లో శుక్రవారం ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వరరావు పర్యటించగా రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు, ఏకంగా ప్రైవేటు వ్యాపారులకు తమ పంటను తూకం వేస్తూ చూపించారు పండించిన పంటను కొనుగోలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నెలలు గడుస్తున్న కొనుగోలు చేయకపోగా ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికే కాంటాక్ట్ చేసిన బ్యాగులను తీసుకెళ్లకపోగా మిగతా పంటను కాటన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, పెరిగిన ఖర్చులతో పంటలు పండించి చేతికొచ్చిన దశలో గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలు అమలు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు గత కెసిఆర్ పాలనలో వ్యవసాయం పండుగ వాతావరణంలో కొనసాగిందని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అంద పాతాళానికి తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ఘపంటలు కొనుగోలు చేసే పరిస్థితి ఎలా ఉంటే ఖరీఫ్ సీజన్ కుఎరువులు సరఫరా ఏ విధంగా ఉంటుందోనని రైతుల ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరపర కూడా అనుమానంగానే ఉందని మళ్లీ తమ బతుకుల్లో చీకటి ఆవరించే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు మళ్లీ గల్ఫ్ బాట పట్టే రోజులు వచ్చాయా అన్నారు మాజీ జెడ్పిటిసి తో పాటు నర్సాపురం లింగం గడిల దత్తు కిషన్రావు రాజయ్య మల్లయ్య తదితరులున్నారు.

# ప్రతి శుక్రవారం "డ్రై డే"గా పాటించాలి







**దోమల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం**

**కాప్రా, రాజముద్ర న్యూస్:** ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా వంపుగూడ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాప్రా సర్కిల్ డిసి డిసి శ్రీహరి ఏంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలను మరింత వేగవంతం చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందితో పాటు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయిబాబా నగర్ ప్రజలకు దోమల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా దోమ గుడ్డు నుండి లార్వా దశ వరకు దోమగా ఎలా మారుతుందో మొబైల్ వీడియోలు, ఫ్లిప్ బుక్స్ సహాయంతో వివరించారు. ఏంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగిస్తూ ప్రజలకు సూచనలు అందించారు.ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములు, కూలర్లు,పాత టైర్లు,పూల కుండీలు, కొబ్బరి బొండాలు వంటి వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాలనీలు,బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలలో కాలనీ సంక్షేమ సంఘాలు,మహిళా సంఘాలు, మున్సిపల్ అధికారుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఎంటమాలజి ఏఈ డి.రమేష్ లు మాట్లాడుతూ.. దోమల నివారణ ప్రతి పౌరుని బాధ్యతని,దోమల రహిత నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు తమ ఇళ్లలో పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్, ఏంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బ్యాలెట్ యూనిట్లు పోస్టల్ బ్యాలెట్ గోదామును పరిశీలించిన కలెక్టర్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయము పరిధిలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారము పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ అధికారులు, నేమత్ హాలి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ మూమెంట్స్ బ్యాంక్ హాల్ ప్రారంభం



**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోనీ సత్యనారాయణ కాలనీలో శుక్రవారం హ్యాపీ మూమెంట్స్ బ్యాంక్ హాల్ ను నాగారం నాయకుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, సాయినాథ్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు తడిసిన సూర్య, శేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్, వెంకటేశ్వరరావు, జంగారెడ్డి, సురేందర్ రెడ్డి, సత్యనారాయణ కాలనీ అధ్యక్షులు రంగారెడ్డి మధు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. బ్యాంక్ హాల్ యజమాని విశ్వనాథ్ వివిధ పార్టీల నాయకులకు కార్యకర్తలకు స్వాగతం పలకడం జరిగింది.

## జూన్ 3వ తేదీన జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య

**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ టౌన్:** రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం జూన్ 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, బీమా సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులతో, సాయంత్రం 4 గంటలకు పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్.ఐ. యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## తీరిన నీటి కష్టాలు

**యుద్ధప్రాతిపదికన మోటార్ కు మరమ్మతులు**



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని 19వ వార్డులో గత కొన్ని రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులో నీటి మోటార్ చెడిపోవడంతో స్థానిక ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ పాలకమండలి తక్షణమే స్పందించింది. ఆసిఫాబాద్ మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, స్థానిక కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, నాగు బాయ్ లు ప్రత్యేక చొరవ తీసుకుని శుక్రవారం యుద్ధప్రాతిపదికన మోటార్ మరమ్మతు పనులను పూర్తి చేయించారు. మోటార్ రిపేర్ పూర్తి కావడంతో వార్డులో తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది. తమ తాగునీటి సమస్యను వేగంగా పరిష్కరించిన ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** జొన్నల అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. జిల్లాలో జొన్నల కొనుగోలు, రవాణా, గోదాముల నిర్వహణ, హమాలీల కేటాయింపులపై శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు నుంచి రవాణా వరకు అన్ని దశలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రవాణా సజావుగా సాగేందుకు అవసరమైన లారీలను సమకూర్చాలని, గోదాముల్లో తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. హమాలీల కేటాయింపుల్లో ఆలస్యం జరగకూడదని, అవసరమైన మేర హమాలీల సంఖ్య పెంచాలని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాల ప్రకారం పనులను వేగవంతం చేయాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రా, రాజేశ్వర్, మార్క్ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ అధికారి గజానంద్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా కార్మిక శాఖ అధికారి ముత్యం, సిడబ్ల్యూసి మేనేజర్ రవి, ట్రాన్స్పోర్ట్, హమాలీ కాంట్రాక్టర్లు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామానికి చెందిన తూటిపల్లి జ్యోతి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా వైద్యులు పరీక్షలు నిర్వహించి కడుపులో భారీ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సిహెచ్సి వైద్యుడు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్ర చికిత్స నిర్వహించి మహిళ కడుపులో నుంచి సుమారు నాలుగు కిలోల బరువు ఉన్న గడ్డను విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. తక్కువ వనరులతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఇలాంటి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడంపై స్థానికులు వైద్య సిబ్బందిని అభినందించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు డాక్టర్ రమేష్తో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలు సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా ఎదగాలి




**రాజముద్ర న్యూస్,, సత్తుపల్లి:** మహిళలు సమాజ నిర్మాణంలో కీలక శక్తిగా ఎదగాలని, మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్రజాపాలనా– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా శుక్రవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల పేద కుటుంబాల మహిళలకు "ఇందిరా మహిళా శక్తి" చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చేపడుతున్న డ్వాక్రా సంఘాల కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ చైర్మన్ రోహన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, వివిధ వార్డుల మహిళా కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు, మహిళలు, యూత్, ఎన్ఎస్యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

- తూకంవేసే ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు లేకుండా చూడాలి...
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. జిల్లాలోని మూడుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ సుగుణా బాయి,జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ) శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భిక్షం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రంలోని సౌకర్యాలను, ధాన్యం నాణ్యతను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకాలు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు, కేంద్రానికి ధాన్యం తెచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని, తూకం వేసే ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా (రవాణా) చర్యలు తీసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రైతులకు దక్కేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు,రైతులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ సదుపాయాల ద్వారా మహిళలను వివిధ వ్యాపార రంగాల్లో ప్రోత్సహిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. హాజీపూర్ మండలంలో 382 యూనిట్లకు రూ.18.07 కోట్లు, దండేపల్లిలో 316 యూనిట్లకు రూ.16.79 కోట్లు, లక్షెట్టిపేట మండలంలో 512 యూనిట్లకు రూ.18.23 కోట్లు కలిపి మొత్తం 1,210 స్వయం సహాయక సంఘాలకు రూ.53.10 కోట్ల రుణాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా అందించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళకు సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం రాష్ట్రంలోనే మొదటగా పూర్తయిందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు, మండల సమాఖ్య ప్రతినిధులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేట, నమ్నూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎస్ఆర్ఎం, గాయత్రి రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. హమాలీల కొరతను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను నియమించి ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం తరలింపునకు ఈసారి ట్రాక్టర్లను వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు 10వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని జై యోగేశ్వర రైస్ మిల్లును మండల తహశీల్దార్ దిలీప్ కుమార్తో కలిసి సందర్శించారు. ధాన్యం దిగుమతి, సీఎంఆర్ ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకుని, సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లుల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ రైతులకు వరం

- పిప్పిరిలో 5 ఎకరాల సబ్ మార్కెట్ యార్డు మంజూరు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ధన్యవాదాలు
- జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఇంచార్జ్ ఆడే గజేందర్ కృషి అమోఘం



**రాజముద్ర న్యూస్, బోథ్:** బోథ్ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. రైతుల అవసరాల దృష్ట్యా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలోని సర్వే నెంబర్ 126 లో 5 ఎకరాల విస్తీర్ణంలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం G.O. MS. No. 33 ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.ఈ సందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ మాట్లాడుతూ,మార్కెట్ యార్డు సాధనలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని కొనియాడారు. రైతుల పక్షాన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, ప్రతి మండల కేంద్రంలో రెండు కొనుగోలు కేంద్రాలను పెంచి రైతుల సమస్యలను తీరుస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు యూసఫ్, పోచెర మాజీ ఉపసర్పంచ్ మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు అమీర్, గుంజల ప్రభాకర్, అబ్రార్, ఆశన్న, కౌసర్, శేమందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన మార్తిడి సర్పంచ్

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ దండే విఠల్

**రాజముద్ర న్యూస్,కాగజ్నగర్:** బెజ్జూర్ మండలం మార్తిడి గ్రామ సర్పంచ్ మన్నెంపల్లి మల్లేష్తో పాటు అరుణ్ కుమార్,ప్రేమ్ కుమార్,మరికొంత మంది యువ నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే పార్టీ నాయకత్వంపై నమ్మకంతోనే కాంగ్రెస్లో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్తిడి మాజీ సర్పంచ్ ఉమ్మెర లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బుస శంకర్, నాయకులు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



బిజినెస్



## రిలయన్స్ ఫౌండేషన్ సేవ.. కోట్లాది జీవితాల్లో మార్పు!

నీతా అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) ఖర్చులను గణనీయంగా పెంచింది. సామాజిక కార్యక్రమాల కోసం ఏకంగా రూ.2248 కోట్లు ఖర్చు చేసింది. ఇది గత సంవత్సరం (రూ.2156 కోట్లు)తో పోలిస్తే సుమారు రూ.100 కోట్లు ఎక్కువ. కోవిడ్ తర్వాత కాలం నుంచి ఇప్పటివరకు రిలయన్స్ ఫౌండేషన్ మొత్తం సీఎస్ఆర్ ఖర్చు రూ.9,500 కోట్లు దాటింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 9.7 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం చేకూరింది. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ జీవనంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదాహరణకు.. గ్రామీణ ప్రాంతాల్లోని ఒక డెయిరీ రైతు ఆదాయం గణనీయంగా పెరిగి రెండింతలయింది. అంతే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్ కోసం స్కాలర్‌షిప్ సదుపాయాలను అందిస్తున్నారు. 2020-21లో ప్రారంభమైన రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రతి సంవత్సరం సుమారు 5,100 మంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. వీరిలో చాలామంది మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందారు. వారి కుటుంబాల ఆర్థిక స్థితిలో పురోగతికి సహాయపడుతున్నారు. ఇది సమాజంలో దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన అంశంగా నిపుణులు చెబుతున్నారు. మహిళా సాధికారత విషయంలో కూడా స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. డిజిటల్ లిటరసీ, ఆర్థిక అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళల్లో 75% మందికి ఆర్థిక నిర్ణయాలపై విశ్వాసం పెరిగింది. సగం మంది కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో మరింతగా పాల్గొంటున్నారు. జంతు సంరక్షణ రంగంలో వంతారా ద్వారా ఇప్పటివరకు 1.5 లక్షలకు పైగా జంతువులకు సంరక్షణ అందించారు. దీనికిగాను అనంత్ అంబానీకి 2025లో గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డు లభించింది. నీతా అంబానీకి కూడా అంతర్జాతీయ స్థాయిలో హ్యూమానిటేరియన్ అవార్డులు వచ్చాయి. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పాడి రైతుల రోజువారీ పాలు ఉత్పత్తి 6.14 లీటర్ల నుంచి 10.37 లీటర్లకు పెరిగింది. వారి వార్షిక ఆదాయం సుమారు 64.6% పెరిగింది. మొత్తం కుటుంబ ఆదాయం కూడా సుమారు 56% వరకు పెరిగింది. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఫౌండేషన్ సేవలు అందించింది. ఆంధ్రప్రదేశ్ తీరంలో వచ్చిన తుపాను హెచ్చరికల సమయంలో ముందస్తు సమాచారం ఇచ్చి మత్స్యకారులు, రైతులను అప్రమత్తం చేసింది. ఈ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు కూడా లభించింది. ఇలా రిలయన్స్ ఫౌండేషన్ సామాజిక కార్యక్రమాల కోసం ప్రతి ఏటా భారీ మొత్తంలో ఖర్చు చేస్తోంది.

# భారతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనం..

## 1100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. రూ.5 లక్షల కోట్లు నష్టం




భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా పతనమయ్యాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన ట్రేడింగ్ చివరికి అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీనష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,092.06 పాయింట్లు (1.44 శాతం) నష్టపోయి 74,775.74 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 76,220.02 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ చివరికి నష్టాల్లో ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 359.40 పాయింట్లు (1.50 శాతం) నష్టపోయి 23,547.75 వద్ద ముగిసింది. దేశంలో ఇన్వెస్టర్ల సంపద ఈ ఒక్కరోజే దాదాపు రూ.5 లక్షల కోట్లు నష్టపోయింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.466 లక్షల కోట్లుగా ఉంది. దేశంలో రుతుపవనాల రాక ఆలస్యం కానుందనే వార్తలు, అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు. దేశంలో రుతపవనాలు ఆలస్యమైతే వర్షాలు సరిగ్గా కురవవు. దీనివల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదు-ర్కోవాల్సి వస్తుందనే భయం మార్కెట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభాలు చవిచూడగా, మిగతా షేర్లు భారీగా నష్టపోయాయి. వాటిలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ఎక్కువగా నష్టాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 95.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల ధర 91.40 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4530 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రూ.1.4 కోట్ల బిల్లు కస్టమర్లకు వాపస్!



వ్యాపారంలో లాభాల కంటే వినియోగదారుల నమ్మకమే ముఖ్యమని బార్బెక్యూ రెస్టారెంట్ తెలిపింది. తాము అందించిన ఆహారం సొంత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గ్రహించిన సదరు యాజమాన్యం.. ఏకంగా కస్టమర్లకు సుమారు రూ.1.4 కోట్లు (1,62,000 అమెరికన్ డాలర్లు / 1.1 మిలియన్ యువాన్లు) తిరిగి చెల్లించింది. కస్టమర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకపోయినా సంస్థే స్వయంగా ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 'ది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' నివేదిక ప్రకారం.. చైనావ్యాప్తంగా 142 అవుట్‌లెట్లతో విస్తరించిన ప్రసిద్ధ బ్రాండ్ 'వెరీ లాంగ్ అగో లాంబ్ స్కేవర్స్' ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

### అసలేం జరిగింది? గ్రిల్లింగ్‌లో లోపమే కారణమా?

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కంపెనీకి చెందిన 24 అవుట్‌లెట్లలో దాదాపు 48,000 టేబుల్స్ వద్ద భోజనం చేసిన కస్టమర్లను రెస్టారెంట్ యాజమాన్యం ఈ నెల ప్రారంభంలో స్వయంగా సంప్రదించింది. అంతర్గత నాణ్యత సమీక్షలో ఒక షాకింగ్ నిజం బయటపడటమే దీనికి కారణం. ఆ సమయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రిల్లింగ్ పరికరాల్లో ఉష్ణోగ్రత స్థిరంగా లేకపోవడం వల్ల, మటన్ కబాబ్‌లు ఆశించిన స్థాయిలో గ్రిల్ కాలేదని కంపెనీ గుర్తించింది. కస్టమర్ల నుంచి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ తమ బ్రాండ్ విలువలకు కట్టుబడి సదరు మటన్ స్కేవర్ల ధరలో 50 శాతం మొత్తాన్ని ఖాతాదారులకు రీఫండ్ చేసింది.

### నిజాయితీయా? మార్కెటింగ్ జిమ్మిక్కా?

ఈ భారీ వాపసు కార్యక్రమం నెట్టింట వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'లాభాల కంటే కస్టమర్ల సంతృప్తికే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన రెస్టారెంట్ నిజాయితీ అమోఘం' అని మెజారిటీ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, మరికొందరు మాత్రం ఇది బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికి, పబ్లిసిటీ కోసం ప్లాన్ చేసిన ఒక తెలివైన మార్కెటింగ్ వ్యూహం కావచ్చునని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

# గిల్ గర్జన.. శుభ్‌మన్ సూపర్ సెంచరీ

స్పోర్ట్స్

**ఫైనల్లో గుజరాత్**

**క్వాలిఫయర్-2లో రాజస్థాన్ ఓటమి**

**వైభవ్ మెరుపులు వృథా**



**ముల్లన్‌పూర్ :** ఐపీఎల్19వ సీజన్‌లో బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) మెరుపులకు.. రాజస్థాన్ రాయల్స్ పోరాటానికి తెరపడింది. 15 ఏండ్ల ఈ యువ కెరటం ఆడిన మరో అద్భుత ఇన్నింగ్స్ ఆ జట్టును ఫైనల్ చేర్చలేకపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104) క్లాసిక్ సెంచరీతో చేసిన గర్జనకు తోడు సాయి సుదర్శన్ (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) సత్తా చాటడంతో రాజస్థాన్‌కు చెక్ పెట్టిన గుజరాత్ టైటాన్స్ మూడోసారి తుదిపోరుకు దూసు కెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2లో జీటీ 7 వికెట్ల తేడాతో రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆర్ఆర్ ఇచ్చిన 215 టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 214/6 స్కోరు చేసింది. వైభవ్‌తోపాటు జడేజా (45నాటౌట్) చివర్లో ఫెరీరా (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 నాటౌట్) కూడా రాణించారు. హోల్డర్, రబాడ చెరో రెండు వికెట్లు తీశారు. గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో ఆర్సీబీతో జీటీ అమీతుమీ తేల్చుకోనుంది.

**కెప్టెన్ గిల్ ముందుండి...**

క్వాలిఫయర్-1లో తేలిపోయిన గుజరాత్ టాపార్డర్ ఈసారి అద్భుతంగా ఆడింది. ఓపెనర్లు సుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు 167 రన్స్ జోడించి ఫైనల్‌కు బాట వేశారు. భారీ ఛేదనలో క్లాసిక్ షాట్లతో హోరెత్తించారు. ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా శిక్షించి ఛేజింగ్‌ను వన్‌సైడ్ చేశారు. ఫామ్‌లో ఉన్న ఆర్చర్ తొలి ఓవర్లోనే చెరో రెండు ఫోర్లతో తమ ఉద్దేశం ఏంటో చెప్పారు. ఆర్చర్‌ను టార్గెట్ చేసిన గిల్ మరో రెండు ఫోర్లు రాబడితే.. బర్గర్, తుషార్‌కు సుదర్శన్ రెండేసి బౌండరీలతో స్వాగతం పలికాడు. ఓపెనర్ల జోరుకు పవర్‌ప్లేను 69/0తో ముగించింది. ఆ తర్వాత గిల్‌గేరు మార్చి మరింత స్పీడు పెంచారు. తుషార్ వేసిన తొమ్మిదో ఓవర్లో 6,4,4 బాది 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు వంద దాటించాడు. పదో ఓవర్లో బంతిని అందుకున్న జడేజాను 6,6,4తో శిక్షించడంతో స్టేడియం హోరెత్తింది. కెప్టెన్‌ను చూసి సుదర్శన్ సైతం వేగం అందుకున్నాడు. యశ్‌రాజ్ బౌలింగ్‌లో తొలి సిక్స్ కొట్టి అర్ధ శతకం అందుకున్నాడు. ఈ జోరు చూస్తుంటే ఇద్దరే లక్ష్యాన్ని కరిగించేలా కనిపించారు. కానీ, బ్రిజేశ్ వేసిన 13వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాయి.. ఐదో బాల్‌ను కట్ షాట్‌తో బౌండరీకి పంపే ప్రయత్నంలో జారి పోయిన బ్యాట్ వికెట్లపై పడటంతో గత మ్యాచ్ మాదిరిగా హిట్ వికెట్‌గా ఔటయ్యాడు. జడ్డూ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ కొట్టి సెంచరీ (47 బంతుల్లో) పూర్తి చేసుకున్న గిల్‌ను తర్వాతి ఓవర్లో ఆర్చర్ ఎల్బీ చేసినా అప్పటికే మ్యాచ్ జీటీ చేతుల్లోకి వచ్చేసింది. తెవాటియా (17 నాటౌట్), సుందర్ (16), బట్లర్ (9 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

**పట్టువదలని సూర్యవంశీ**

తన స్టయిల్‌కు భిన్నంగా పరిస్థితులకు తగ్గట్టుగా ఆడిన వైభవ్ ముందుండి నడిపించగా.. చివర్లో ఫెరారీ మెరుపు బ్యాటింగ్‌తో రాజస్థాన్ మంచి స్కోరు చేసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన ఆ టీమ్‌కు ఆరంభంలోనే వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సిరాజ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జైస్వాల్ (1)ను ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జురెల్ (7)ను రబాడ వెనక్కుపంపడంతో ఆర్ఆర్ 9/2తో నిలిచింది. అయితే నాలుగో నంబర్‌లో వచ్చిన జడేజాతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. పిచ్ నుంచి అంతగా సహకారం లేకపోవడం.. ప్రత్యర్థి పేసర్లు షార్ట్ పిచ్ బాల్స్, బౌన్సర్లతో పరీక్షిస్తుండగా.. వైభవ్ తన శైలికి భిన్నంగా జాగ్రత్తగా ఆడుతూనే చెత్త బాల్స్‌ను మాత్రం శిక్షించాడు. సిరాజ్ వేసిన మూడో ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన అతను రబాడ వేసిన 153 కి.మీ స్పీడ్ బంతిని స్ట్రెయిట్ సిక్స్‌గా కొట్టడం ఇన్నింగ్స్‌కే హైలైట్. మరో ఎండ్‌లో జడేజా కూడాక్రమం తప్పకుండా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేను రాజస్థాన్ 70/2తో ముగించింది.

చేతి నొప్పి కారణంగా జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. తొమ్మిదో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ పరాగ్ (11) 4,6 కొట్టి ఔటయ్యాడు. అతనితో పాటు షనక (3)ను హోల్డర్ పెవిలియన్ చేర్చగా.. మధ్యలో ప్రసిధ్ బౌలింగ్‌లో వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను సుదర్శన్ డ్రాప్ చేశాడు. అప్పటికి 46 రన్స్ వద్ద ఉన్న వైభవ్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో ఆర్చర్ (7) కీపర్‌కు చిక్కడంతో 118/5తో నిలిచిన జట్టును సూర్యవంశీ ఆదుకున్నాడు. 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అతను మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా తోడుగా స్పీడు పెంచాడు. రబాడ, సిరాజ్ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టిన వైభవ్.. హోల్డర్ వేసిన 16వ ఓవర్లో 4,6,6తో స్కోరు 150 దాటించాడు. ఆపై స్పిన్నర్ సుందర్‌ను రెండు సిక్సర్లతో శిక్షించిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, 18వ ఓవర్లో రబాడ షార్ట్ పిచ్ బాల్‌ను అప్పర్ కట్ షాట్ ఆడిన సూర్య.. ప్రసిధ్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, స్పిన్నర్ రషీద్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్సర్లతో విరుచుకుపడిన ఫెరీరా జట్టుకు మంచిస్కోరు అందించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లలో 214/6 (వైభవ్ 96, జడేజా 45 నాటౌట్, హోల్డర్ 2/27, రబాడ 2/35);

గుజరాత్: 18.4 ఓవర్లలో 219/3 (గిల్ 104, సుదర్శన్ 58, ఆర్చర్ , బర్గర్1/35) 1 ఒక సీజన్‌లో 700 పరుగులు పూర్తి చేసిన తొలి అన్‌క్యాప్డ్ ప్లేయర్ వైభవ్. 2023లో జైస్వాల్ సాధించిన 625 పరుగుల రికార్డును అధిగమించాడు. 19 19 ఈ సీజన్ ప్లేఆఫ్స్ రెండు మ్యాచ్‌ల్లో వైభవ్ కొట్టి సిక్సర్లు, ఒక ఎడిషన్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా వృద్ధిమాన్ సాహా ( 2014లో 11) రికార్డును దాటేశాడు. 521 ఈ ఐపీఎల్ పవర్‌ప్లేలో వైభవ్ సూర్యవంశీ చేసిన రన్స్. ఒక సీజన్‌లో అత్యధిక పవర్ ప్లే రన్స్ చేసిన బ్యాటర్‌గా 2016లో వార్నర్ నెలకొల్పిన 467 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. 5 ఐపీఎల్‌లో గిల్‌కు ఇది ఐదో సెంచరీ. కెప్టెన్‌గా రెండోది.

## జొకోవిచ్‌కు షాక్




పారిస్ : ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం. సెర్బియా లెజెండరీ ప్లేయర్ నొవాక్ జొకోవిచ్ అనామక ఆటగాడి చేతిలో ఓడి మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రెండు సెట్లు గెలిచి 2-0తో నిలిచిన దశలో వరుసగా మూడు సెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓడిపోయాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో 28వ సీడ్ జావో ఫోన్సెకా (బ్రెజిల్) 4-6, 4-6, 6-3, 7-5, 7-5తో మూడో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. స్పెయిన్ ఆటగాడు పాబ్లో కారెనో బుస్టా 7-6 (0), 7-5, 3-6, 6-4తో అర్జెంటీనా ప్లేయర్ తిరాంతెను ఓడించగా.. రుబ్లెవ్ 7-5, 7-6 (7/2), 7-6 (7/2)తో నునో బోరగ్స్‌పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో పోలెండ్ స్టార్ స్వియాటెక్ 6-4, 6-4తో మగ్దా లినెట్‌ను ఓడించగా.. ఏడో సీడ్ స్వితోలినా 6-2, 6-3తో కార్చాచ్‌పై, ఎనిమిదో సీడ్ ఆంద్రీవా 6-4, 6-2తో మేరీ బౌజ్కోవాపై నెగ్గి ముందంజ అయితే, అన్‌సీడెడ్ టీచ్‌మన్ 6-1, 7-5తో గత సీజన్ రన్నరప్ కరోలినా ముచోవాకు షాకిచ్చింది.

# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు




అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.




# పెద్దిపై అసత్య ప్రచారం

## ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు


'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలు చేపట్టినట్లు అయింది. ఇప్పుడు ఇలా సోషల్ మీడియాలోనూ చిత్రబృందం యాక్టివ్‌గా ఉంటూ నిశితంగా పరిశీలించి నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది





# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.

# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా




తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ స్వరం తం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.




# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- స్వరం త దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన స్వరం తం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను స్వరం తంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర స్వరం త దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త స్వరం త దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో స్వరం తం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర స్వరం త దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం. కథ పూర్తిగా సిద్ధం కాకముందే స్వరం త దర్శకుడిని ఫైనల్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajgiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com